

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అమరావతి: మండల పరిధిలోని మల్లాది సమీపంలో గురువారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను అమరావతి పోలీసులు సీజ్ చేశారు.



కానుకల లెక్కింపు

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం 4 నెలల హుండీ ఆదాయం రూ. 37,713 వచ్చింది.



పిడుగురాళ్లలో భారీ వర్షం

పిడుగురాళ్ల: పట్టణంలో గురువారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ కాయగా.. సాయంత్రం 5 గంటలకు వర్షం పడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

న్యూస్‌రీల్

మహంకాళీ అమ్మవారికి రూ.15.81 లక్షల ఆదాయం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీలను గురువారం కార్యనిర్వహణాధికారి కె. సునీల్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులు లెక్కించారు. మొత్తం రూ. 15,81,924 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో రూ.12,10,467 మాత్రమే వచ్చిందని, ప్రస్తుతం రూ. 3,71,457 అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రంగప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో జ్యోతి వర్మకు పతకం



మంగళగిరి: గోవాలో జరుగుతున్న నేషనల్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్ , ఉమెన్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గుంటూరుకు చెందిన పవర్ లిఫ్టర్ పి. జ్యోతి వర్మ బ్రాంజ్ మెడల్ సాధించినట్లు గురువారం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కరరావు, సంధాని తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో నేషనల్ స్థాయిలో మాస్టర్ 2ప్లస్ 50 ఇయర్స్ విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి పవర్ లిఫ్టర్ జ్యోతి వర్మని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంట వెంకటేశ్వరరావు, కార్యదర్శి సకల సూర్యనారాయణతో పాటు ప్రతినిధులు అభినందించినట్లు తెలిపారు.

తెనాలిలో రోడ్లు జలమయం




తెనాలి అర్బన్: అల్పపీడన ప్రభావంతో తెనాలి పట్టణంలో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే వస్తున్నాయి. గురువారం ఉదయం కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. అనంతరం ఎండ కాసింది. మరలా కొన్ని గంటలకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని కొన్ని రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

నృసింహ స్వామికి రూ. 45.51లక్షల ఆదాయం



మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామికి రూ.45,51,136 ఆదాయం లభించిందని ఈవో ఏ. రామకోటిరెడ్డి తెలిపారు. స్వామి దిగువ సన్నిధి, ఎగువ సన్నిధిలతో పాటు ఘాట్ రోడ్డుపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించినట్లు పేర్కొన్నారు. ఎగువ సన్నిధిలో రూ. 18,90,274, దిగువ సన్నిధిలో రూ. 25,30,803, వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ. 85,800తో పాటు అన్నదానానికి రూ. 44,259 సమకూరినట్లు తెలిపారు.గత మూడు నెలల కంటే ప్రస్తుతం రూ. 29,259 అదనంగా వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమాన్ని కాజ గ్రూపు దేవస్థానాల ఈవో పి. వెంకటరెడ్డి పర్యవేక్షించారు.

ప్రకాశం బ్యారేజ్ దిగువకు నీరు విడుదల



తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వరద నీరు రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు గురువారం సాయంత్రం గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. జేఈ రాజేష్ మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్ట్ , ఇతర వాగుల నుంచి 61,072 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజ్‌కు వచ్చి చేరనున్నదని తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగుల నీటిమట్టం కొనసాగిస్తూ 60 గేట్లు అడుగు ఎత్తును, 10 గేట్లను రెండు అడుగుల ఎత్తును ఎత్తి దిగువకు 57,500క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని చెప్పారు. తూర్పు డెల్టా కాలువకు 3,056 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 516 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రీచ్‌ల ద్వారా ఇసుక తూచ్

ఉచిత ఇసుక అంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఆదిలోనే అభాసుపాలైంది. పారదర్శకంగా ఇసుక పంపిణీ అంటూ టెండర్లు మరీ పిలిచి హడావుడి చేసింది. దొడ్డిదారిన తెలుగు తమ్ముళ్లకే రీచ్‌లు అప్పగించింది. ఇప్పుడు కూటమి నేతల ఉచిత ఇసుక హామీ కృష్ణమ్మ వరదలో కొట్టుకుపోయింది. రీచ్‌లో నీరు చేరడంతో చిన్న ఇసుక రేణువును కూడా తీసే మార్గం లేదు. సామాన్యుడు ఇల్లు కట్టుకుందామంటే తట్ట ఇసుక కూడా దొరక్క అల్లాడిపోతున్నాడు. ప్రభుత్వ వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.



గుండెమెడ ఇసుక రీచ్

- ప్రభుత్వం కేటాయించిన క్వారీల్లో నాలుగు అడుగుల మేర నీళ్లు
- వాహనాలు వెళ్లే మార్గాలు మునక
- కష్టంగా మారిన ఇసుక తవ్వకం
- 2.96 లక్షల టన్నులు అందుబాటులో అని అధికారుల ఆర్భాటం
- డిసెంబర్ దాకా వరద నీరు ఉంటుందంటున్న ఇరిగేషన్ అధికారులు
- సామాన్యుడు ఇల్లు కట్టుకుందామంటే ఇసుక కరువు
- కూటమి హామీపై ప్రజల మండిపాటు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : '' ఇసుక కావాల్సినంత అందుబాటులో ఉంది.. ఈ నెల 16 నుంచి 2.96 లక్షల టన్నులు అందుబాటులోకి వస్తుంది.. నాలుగు క్వారీలు టెండర్లు పిలిచి అప్పగిస్తాం '' అంటూ వారం రోజుల కిందట కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెనాలిలో ఆర్భాటంగా ప్రకటించారు. అన్నట్టుగానే తాడేపల్లి మండలం గుండెమెడ, కొల్లిపర మండలం మున్నంగి, బొమ్మువానిపాలెం(2) క్వారీలకు టెండర్లు కూడా పిలిచారు. మూడు కంపెనీలకు అప్పగించారు. ఈ మూడింటినీ కూడా తెలుగు తమ్ముళ్లే దక్కించుకున్నారు. కట్ చేస్తే...అసలు ఆ నాలుగు క్వారీలలో ఇసుక అందుబాటులో లేదు. గుండె మెడ క్వారీలో మట్టి, బుసక తప్పా ఇసుక జాడే లేదు. మున్నంగి, బొమ్మువానిపాలెంలో నాలుగు నుంచి ఆరడుగుల నీటి లోపల ఇసుక ఉంది. వర్షాలకు నీట మునిగిందని అధికారులే చెబుతున్నారు.

సామాన్యుల ఆశలు అడియాసలు

ముహూర్తాలు ముంచుకురావడంతో ఎంతోమంది సొంత ఇంటిని నిర్మించుకోవాలని ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంటి నిర్మాణం చేపట్టాలంటే తప్పనిసరిగా ఇసుక కావాలి. కానీ అందుబాటులోకి రాకపోవడంతో ఆశలు అడియాసలుగా మారుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా గుంటూరు జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చారు. వీటిల్లో 2.96 టన్నులను బయటకు తీయవచ్చని నివేదిక అందజేశారు.

ఇసుక ఎలా తీస్తారో ?

గత నెల రోజుల కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి వరదలు వచ్చాయి. అప్పటి నుంచి ప్రకాశం బ్యారేజ్ వద్ద 30 వేల నుంచి 45 వేల క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. దీంతో ఇసుక రీచ్‌లలో కేటాయించిన ప్రాంతాల్లో నాలుగు అడుగుల లోతులో నీళ్లు పారుతున్నాయి. ఇలాంటి సమయంలో ఇసుక ఎలా తీస్తారో? అర్థం కావడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇసుక కాదు బుసక

- గుంటూరు జిల్లాలో తాడేపల్లి రూరల్‌పరిధిలోని గుండిమెడ ఇసుక రీచ్‌లో అసలు ఇసుకే లేదు. అక్కడ బుసక ఉందని, దాంతో ఇళ్ల నిర్మాణాలు చేయడం కష్టమని పలువురు అంటున్నారు.
- కొల్లిపర మండలంలోని మున్నంగి ఇసుక రీచ్‌లో నాలుగు అడుగుల కింద ఇసుక ఉంది. అక్కడ ఇసుక తీయాలంటే ముందుగా రోడ్లు నిర్మించాలి. నీళ్లతో కలిపి ఇసుకను తోడాల్సిన పరిస్థితి ఉంది. అంత ఖర్చుపెట్టి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తుందనేది ఒట్టిమాటలే అని వినియోగదారులు వ్యాఖ్యానిస్తున్నారు.
- కొల్లిపర మండలంలోని ఒకే ఇసుక రీచ్‌లో రెండు పాయింట్లను మైనింగ్‌శాఖ అధికారులు తీసేందుకు నిర్ణయించారు. ఆ ఇసుక రీచ్‌లో ఆరు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. ఇసుక ఉన్న ప్రాంతానికి వెళ్లాలంటే 500 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టాలి. స్థానిక తహసీల్దార్లు మాత్రం కేటాయించిన రీచ్‌లలో ప్రస్తుతం నీళ్లు ప్రవహిస్తున్నాయని, ఇసుక తీసే అవకాశం లేదని తెలుపుతున్నారు. జిల్లా అధికారులు ఇందుకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించడంతో వినియోగదారులు అయోమయంలో పడ్డారు.

దిక్కుతోచని వినియోగదారులు

ఇప్పటికే చాలామంది ఇంటి నిర్మాణం చేసేందుకు శంకుస్థాపనలు చేశారు. ఇసుక లేక జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఇంటి నిర్మాణాలు ఆగిపోయాయి. కృష్ణానది తీరంలో ఉన్న టిప్పర్లు, ట్రాక్టర్ల యజమానుల వద్దకు ఇసుక కావాలంటూ క్యూలు కడుతున్నారు. ట్రక్కు ఇసుక రూ. 8 వేలు, లారీ రూ. 40 వేలు చెప్పడంతో ఇల్లు ఎలా కట్టాలో అర్థం కాక వినియోగదారులు సతమతమవుతున్నారు.



బొమ్మువానిపాలెం ఇసుక రీచ్



మున్నంగి ఇసుక రీచ్

క్రీడా సంబరం







ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పలు అథ్లెటిక్స్ అంశాల్లో క్రీడాకారులు పోటీ పడ్డారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మరి కొంతమంది ఏపీ అథ్లెట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు.

వాల్మీకి మహర్షి ఆధ్యాత్మిక గురువు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



వాల్మీకి మహర్షి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, డీఆర్వో

గుంటూరు వెస్ట్: రామాయణాన్ని కళ్లకు కట్టినట్లు రచించిన వాల్మీకి మహర్షి దేశ ఆధ్మాత్మిక గురువని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథంలో ప్రతి పాత్రా కుటుంబ ఔన్నత్యాన్ని, త్యాగాలను సూచిస్తుందని పేర్కొన్నారు. అతి సాధారణ స్థాయి నుంచి మహర్షిగా ఎదిగిన వాల్మీకి జీవితం ఆద్యంతం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. డీఆర్వో పెద్ది రోజా, సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్ నివాళులర్పించారు.

పంటలు దెబ్బతిన్న రైతుల రుణాలు రీ షెడ్యూల్



కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో భారీ వర్షాలు, వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రెండు సంవత్సరాల పాటు రీ షెడ్యూల్ చేసుకునే అవకాశం కల్పించినట్లు కలెక్టర్ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర పంట రుణాలకు(మారటోరియం), తాత్కాలిక నిషేధంతో కలుపుకొని రెండు సంవ్సరాల వరకు అదనంగా ఎలాంటి జరిమానా, వడ్డీ లేకుండా పొడిగించుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. తీసుకున్న పంట రుణం చెల్లించాల్సిన గడువు ముగియని రైతులకే ఈ ప్రయోజనం వర్తిస్తుందన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా బ్యాంకర్లకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ఇళ్లు, చేనేత మగ్గాల మరమ్మతులు, ఇంటి పరికరాల కొనుగోలుకు కూడా రూ.25 వేలు వరకు రుణాలకు అవకాశం కల్పించినట్లు ఆమె వివరించారు.

ఆలపాటికి ఆమోదం ఏదీ!

- స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటయ్యేనా?
- పార్టీ అనుమతి లేని సమావేశాలు కుదరవన్న నేతలు
- కూటమితో సంప్రదింపులు లేకుండానే అభ్యర్థి ఎలా?
- నివేదికల తరువాతే ఖరారంటూ టీడీపీ బుజ్జగింపు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై కూటమిలో తకరారు
- అన్నింటా వారేనా అంటున్న ఇతర సామాజిక వర్గాలు



సాక్షి, విజయవాడ: ముందడుగు మనదైతే అధిష్టానం ముందరి కాళ్లకు బంధం వేయవచ్చన్న వ్యూహంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ వేస్తున్న అడుగులు ఆయన రాజకీయానికి చేటు తెచ్చేలా ఉన్నాయి. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు... అన్న చందాన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని తానేనంటూ చేసుకుంటున్న స్వీయ ప్రచారాన్ని కూటమి వర్గాలు తప్పుపడుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆలపాటి తీరును కూటమి పక్షాల సంగతి అటుంచి స్వపక్షంలోని సీనియర్లతో సహా ఆ పార్టీకి చెందిన విభిన్న సామాజికవర్గాల వారు అంతర్గతంగా వ్యతిరేకిస్తున్నారు. స్వయంప్రకటిత అభ్యర్థిత్వం చెల్లుబాటు కాదని, పార్టీ ముఖ్య నాయకులు, నిఘా వర్గాల సమాచారాన్ని సమీక్షించుకున్న తరువాతే అభ్యర్థి ఎవరనే స్పష్టత వస్తుందని టీడీపీ అధిష్టానం కూటమిలోని జనసేన, బీజేపీ ముఖ్యులకు సమాచారం పంపిందని వినికిడి. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అయిన ఆలపాటికి గత ఎన్నికల్లో తెనాలి నుంచి టీడీపీ టిక్కెట్టు దక్కకపోవడంతో ఏదో ఒక ముఖ్య పదవి ఆశిస్తున్న నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అవకాశంగా అనిపించింది. పార్టీ పనిలో భాగంగా పట్టభద్రుల ఓటర్ల చేరిక తదితరాలను చూడాలని అధిష్టానం సూచించిందని, తననే అభ్యర్థిగా పోటీలో నిలుపుతారనే ప్రచారాన్ని ఆలపాటి చేసుకుంటున్నారని, అంతకుమించి అధిష్టానం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా, సూచనలు చేయలేదని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సీనియర్లు గుర్తు చేస్తున్నారు. అధిష్టానం చెప్పకుండా ఆయన కోసం తాము నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఎలా నిర్వహిస్తామని ప్రస్తుత గుంటూరు జిల్లాలోని ఓ శాసనసభ్యుడు ప్రశ్నించడంతో ఆలపాటి వర్గీయులు వెనుతిరిగారనేది సమాచారం. ప్రస్తుత గుంటూరు జిల్లా నుంచి ఒకే సామాజిక వర్గానికి చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్, నాదెండ్ల మనోహర్‌లు ఉండగా మళ్లీ అదే సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీకి ఎలా నిలుపుతారని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన నాయకులు అభిప్రాయపడుతుండటం పరిశీలనాంశం. 'ఎలాంటి హోదా, అధికారం లేకుండానే ఆయన పెత్తనం చెలాయిస్తున్నారు. అధికారుల పోస్టింగ్‌లు తనకు అనుకూలంగా ఉండాలని గట్టి పైరవీలు చేశారు. పోలీసులు, మునిసిపల్ అధికారులకు హుకుం జారీ చేస్తూ పనులు చేయాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. అలాంటి ఆయనకు పదవి కూడా సమకూరితే నియోజకవర్గంలో మేమేం చేయాలి' అని కూటమిలోని ముఖ్య నేత వద్ద ఓ ప్రజాప్రతినిధి ప్రస్తావించినట్లు తెలిసింది. ఆయన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం గురించి సంప్రదించారా, అలాంటివి ఏమీ లేకుండానే నిర్ణయం జరిగిపోయినట్లు ప్రచారం ఎలా చేసుకుంటారని కూడా అడిగారనేది సమాచారం.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని ఆశిస్తున్న వారి సంఖ్య కూటమి పార్టీల నుంచి ఎక్కువగానే ఉంది. ఎవరంతట వారు ప్రయత్నాలు అంతర్గతంగా చేసుకుంటున్నారని తెలిసింది. కాగా ఆలపాటి అన్ని మార్గాల్లోనూ ప్రచారం వేగవంతం చేస్తుండటాన్ని టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి కట్టడి చేయాలని, లేదా ఏదో ఒక స్పష్టత ఇవ్వాలని కూటమి నేతలు కోరనున్నట్లు తెలిసింది.

ఆలపాటికి సహకారం అనుమానమే..

ఆలపాటిని రాజకీయంగా బాహాటంగా వ్యతిరేకించే సీనియర్లు ఉమ్మడి గుంటూరులో పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ఇరుగుపొరుగు నియోజకవర్గాలలో జోక్యం చేసుకుంటూ ఇబ్బందులు పెడుతుంటారనే ఆరోపణలు ఆలపాటిపై లేకపోలేదు. తెనాలి సీటు ఇవ్వలేని పక్షంలో తనకు మరోచోట అయినా ఇవ్వాలంటూ ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోని నియోజకవర్గాలపై ఆయన దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఆయా నియోజకవర్గాలకు చెందిన వారు ఆలపాటికి రేపటి ఎన్నికల్లో సహకరిస్తారా అనే అనుమానాలు కూడా అధిష్టానంలో ఉన్నాయని గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు అభిప్రాయపడటం పరిశీలనాంశం. 'మా బాబు గారి సంగతి తెలియంది ఏముంది. ముందుగా ప్రచారానికి ఒక రాయి విసురుతారు. తను ఇవ్వాలనుకుంటే ఇస్తారు. లేదంటే నీపై వ్యతిరేకత తీవ్రంగా ఉంది. నివేదికలు భిన్నంగా ఉన్నాయి కుదరదు అంటారు' అని ముక్తాయించారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డిగ్రీ 5వ , 6వ సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని ఆయన సూచించారు. ఈ సందర్భంగా సీఈ ఎ. శివ ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు నవంబర్ 2వ తేదీలోగా రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా శ్రావణ్‌బాబు



గుంటూరు మెడికల్ : జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబును నియమిస్తూ గురువారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ కె.పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రావణ్‌బాబు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా ఫారెన్ సర్వీసులో మూడేళ్ల నుంచి పని చేస్తున్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ సుబ్బరాజు ఇటీవల కాకినాడకు బదిలీ అయ్యారు.

అండర్-17 వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక



వేజండ్ల(చేబ్రోలు): మండలంలోని వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ -17 బాలబాలికల వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు గురువారం జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి 450మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ ఎం. రవి, బాపట్ల జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ కరీముల్లాతో వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. స్థానిక పీఈటీ వెంకటేశ్వరరావు ఎంపికలను పర్యవేక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 20న హిందూపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు దుస్తులను గ్రామ పెద్దలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మజీరావు తెలిపారు. ఏపీపీజీసెట్- 2024లో ర్యాంకులు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 21వ తేదీ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రవేశాలు పొందే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,200** గరిష్ఠం : రూ. **5,700**

మోడల్ ధర రూ. **5,000**

క్లుప్తంగా

యార్డుకు 51,885 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 51,885 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,582 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 26,786 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏఎన్‌యూలో క్రీడల సందడి

- సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- తొలిరోజు ప్రతిభ కనబరిచిన ఏపీ అథ్లెట్లు
- పలు అంశాల్లో బంగారు పతకాలు కైవసం





వివిధ విభాగాల్లో పోటీ పడుతున్న అథ్లెట్స్

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన గురువారం పలు అథ్లెటిక్స్ అంశాల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మరి కొంతమంది ఏపీ అథ్లెట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. పలు అథ్లెటిక్స్ అంశాల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన అథ్లెట్ల వివరాలు వరుసగా....

అండర్–20 కేటగిరి

పురుషుల విభాగం 100 మీటర్ల పరుగులో షేక్ రోషన్(ఏపీ), రితిక్ (తమిళనాడు), మార్క్ ఆంథోనీ డి కోస్టా(కర్నాటక). పురుషుల 1500 మీటర్ల పరుగులో కాత్రావత్ శ్రీను (తెలంగాణ), కురుబా మహేంద్ర(ఆంధ్రప్రదేశ్), కృష్ణ రాథోడ్(కర్నాటక). పురుషుల 5000 మీటర్ల నడకలో విజయ్ సావరత్కర్(కర్నాటక), సుగుమార్ ఎస్ (తమిళనాడు), హరీష్ ముల్లు(ఆంధ్రప్రదేశ్) ఉన్నారు.

- పురుషుల లాంగ్‌జంప్‌లో సుషాన్ జి సువమ (కర్నాటక), హరిహరణ్ ఆర్ (తమిళనాడు), లోహియా టి (కర్నాటక). పురుషుల హేమర్ త్రో(6కేజీలు)లో గణేష్ కన్న(తమిళనాడు), అవినాష్(కర్నాటక), వెంకటేష్ నీలమణి(తెలంగాణ) ఉన్నారు.
- మహిళల విభాగం 100 మీటర్ల పరుగులో శ్రీ నారాయణన్ కుట్టి(కేరళ), పర్తిప సెల్వరాజ్(తమిళనాడు), గుణ శ్రీ ఎం (తమిళనాడు).
- మహిళల విభాగం 5000 మీటర్ల నడకలో గీతాంజలి ఏ (తమిళనాడు), సీమా నంద్యాల్కర్(కర్నాటక), ప్రియదర్శిని ఎంకే (తమిళనాడు). మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో షైనీ గ్లాడిస్సియా (తమిళనాడు), మగుదీశ్వరి శివకుర్ (తమిళనాడు), అపూర్వా నాయక్ (కర్నాటక), షాట్‌పుట్‌లో చహానా రామన్(తమిళనాడు), మాధుర్య(కర్నాటక), రేయా ఎస్‌కే(కర్నాటక) ఉన్నారు.

అండర్–18 కేటగిరి

బాలుర విభాగం 100 మీటర్ల పరుగులో ధిరాస్ట్ పి(కర్నాటక), ముదావిత్ గణేష్(తెలంగాణ), శేషు దుడ్డు(ఏపీ) ఉన్నారు.

- పురుషుల హైజంప్‌లో అంబ్రీష్ కె(తమిళనాడు), సినాన్(కర్నాటక). పురుషుల షాట్‌పుట్ (5 కేజీల)లో అనురాగ్(కర్నాటక), ఎస్ పద్మ తేజస్(తమిళనాడు), సుభాష్ హెచ్‌ఎస్(కర్నాటక).
- పురుషుల జావాలిన్ త్రోలో ఎస్. ప్రదీప్(తమిళనాడు), ధరణీధరన్ టి(తమిళనాడు), సుభమ్ సురేష్ కున్దేకర్(కర్నాటక)
- బాలికల విభాగం 100 మీటర్ల పరుగులో స్తుతి శెట్టి(కర్నాటక), మధొమిధ(పుదుచ్చేరి), అనూషా జి నాయక్(కర్నాటక) ఉన్నారు.
- బాలికల 100 మీటర్ల హర్డిల్స్‌లో భవన జి(తమిళనాడు), ఐషా రెన్జిత్(కర్నాటక), అయిత్రోళ్ళ ప్రనతి(తెలంగాణ)
- బాలికల లాంగ్‌జంప్‌లో శ్రీహనీషా పి (తమిళనాడు), అన్నా రోసీ పాల్ (కేరళ), దివిజా భరద్వాజ్(కర్నాటక)
- బాలికల డిస్కస్‌త్రోలో అనుశ్రీ (తమిళనాడు), ఎస్ మెర్లిన్ జార్జ్(తమిళనాడు), తేజస్విని సి (కర్నాటక)

అండర్ – 16 కేటగిరి

బాలుర విభాగం 50 మీటర్ల పరుగులో ఆయుష్ ప్రన్‌జ్వాల్(కర్నాటక), అప్పాల వరుణ్(తెలంగాణ), చొక్కారి కిరణ్ సాయి(ఆంధ్రప్రదేశ్)

- లాంగ్ జంప్‌లో అన్షు యాదవ్(తెలంగాణా), ఉబీష్ రాగవ్ ఎస్(తమిళనాడు), యశ్వంత్ రాజు వేల్పుల(ఏపీ)
- బాలుర షాట్‌పుట్‌లో ప్రణీత్ కుమార్ బోగోజు (ఆంధ్రప్రదేశ్), నిఖిల్ (కర్నాటక), అఖిల్ కె(తమిళనాడు)
- బాలుర జావలిన్‌త్రోలో పుష్పక్ నెల్వాడే(కర్నాటక), నైని శ్రీకాంత్(తెలంగాణా), గోకుల్ బి(తమిళనాడు)
- బాలికల విభాగం 60 మీటర్ల పరుగులో డింపుల్ మహాశ్రీ లక్కోజు(ఆంధ్రప్రదేశ్), టి ధ్రితిక(తమిళనాడు), నిదీక్షా నాయక్(కర్నాటక)
- 80 మీటర్ల హర్డిల్స్‌లో నిరూపా హొల్లా(కర్నాటక), అభినందన ఎస్(కేరళ), ఎంఎం జన్య బొల్లమ్మ(కర్నాటక)
- అండర్– 14 కేటగిరీ బాలికల విభాగంలో ట్రైయాథ్లాన్‌లో ఆర్తి ఎస్‌కే(తమిళనాడు), జైని నక్షత్ర(తెలంగాణ), అక్షయ ఎం(తమిళనాడు)

ఏపీని క్రీడా హబ్‌గా మార్చేందుకు చర్యలు

ఎంపీ కేశినేని శివనాథ్



ప్రారంభోత్సవ సభలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

ఏఎన్‌యూ: అథ్లెట్లు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి, తమ రాష్ట్రానికి కీర్తి తేవాలని ఎంపీ కేశినేని శివనాథ్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను గురువారం సాయంత్రం ఎంపీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు,ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో అథ్లెట్లు ముందుకుసాలని సూచించారు. ఏపీని క్రీడా హబ్‌గా మార్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రసంగిస్తూ క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారాలు అందిస్తామని తెలిపారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఏపీఏఏ కార్యదర్శి గౌతమ్ కిరణ్, ఏపీ అథ్లెటిక్స్ కోచ్ ప్రసాదరెడ్డి, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ ప్రసంగించారు.

క్రీడా సాధనతో సమస్యలను అధిగమించవచ్చు

- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్
- జిమ్నాస్టిక్స్ పరికరాల కోసం ఎంపీ లాడ్స్ నుంచి రూ.35 లక్షలు



బ్యాలెన్సింగ్ బీమ్‌పై విన్యాసాలు చేస్తున్న బాలిక



ప్యార్లర్ బార్ చేస్తున్న బాలుడు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నిత్యం క్రీడా సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక సమస్యల్ని అధిగమించవచ్చని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రస్తుతం చిన్నారులు విద్యకే అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల్ని తమకిష్టమైన క్రీడలో సాధన చేసే విధంగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. జిమ్నాస్టిక్స్ లాంటి క్రీడల్లో రాణించడమంటే అంత సులభం కాదని, చిన్నారులు సాధన సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్ర పోటీలు ఇక్కడే జరుగుతుండటం అభినందనీయమని తెలిపారు. జిమ్నాస్టిక్స్ ఇండోర్ స్టేడియం ఫ్లోర్‌తోపాటు పరికరాల కొనుగోలు కోసం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు సహకారంతో ఎంపీ లాడ్స్ నుంచి రూ.35 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 250 మంది పోటీల్లో పాల్గొన్నారని, మూడు రోజుల పాటు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.పి.ఆర్. విఠల్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు సీహెచ్. వెంకటేశ్వరరెడ్డి జిమ్నాస్టిక్స్ కోచ్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో వాల్మీకి స్థానం ప్రత్యేకం

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, సీఈవో జ్యోతిబసు, ఉద్యోగులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతీయ సంస్కృతిలో వాల్మీకి మహర్షి స్థానం ప్రత్యేకమైనదని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెనీ క్రిస్టినా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆది కావ్యం రామాయణాన్ని రచించిన వాల్మీకి ఆదికవిగా భారతీయ సంస్కృతిలో నిరంతరం సూర్యుని వలే నిలిచి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, వివిధ విభాగాల పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం: వాల్మీకి మహర్షి సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని లిఖించిన జ్ఞాననిధి అని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంప్రదాయ భారతీయ కవిత్వంలో వాల్మీకి మహర్షి కీర్తి చిరస్మరణీయమని అన్నారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు (క్రైం) కె.సుప్రజ, హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు శాంతకుమార్ (ఏఆర్), బి.సీతారామయ్య, ఆర్‌ఐలు శ్రీనివాసరావు, శివరామకృష్ణ, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

యువతలో వృత్తి నైపుణ్యం పెంపొందించాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందిస్తే వారికి ఉపాధి మార్గాలు సుగమమవుతాయని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆటోమొబైల్, ఐటీ, అగర్‌బత్తి తయారీ, జ్యూయలరీ, లెదర్, ప్లబింగ్, కరెంట్ తదితర పనుల్లో శిక్షణనివ్వాలని సూచించారు. దీనికి కంపెనీలు ముందుకురావాలని ఆమె కోరారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో అనేక మందికి ఉపాధి మార్గాలు లభిస్తాయని, దానికి తగ్గ పనులను నేర్చుకోవాలని యువతకు సూచించారు. నిడ్‌క్యాప్ ప్రతినిధి మాట్లాడుతూ గత సంవత్సరం పీఎం అజయ్ ప్రోగ్రాం కింద 300 మందికి శిక్షణనిచ్చేందుకు సిద్ధపడినా ఎవరూ రాలేదని తెలిపారు. అందరూ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగాలే కావాలంటే వీలుపడదని, స్కిల్డ్ వర్క్ కూడా నేర్చుకోవాలని ఆమె సూచించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, యువతకు కల్పించే అవకాశాలను కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి శాఖాధికారి రమాదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ అడిషనల్ మేనేజర్ ప్రసన్నకుమార్, అధికారులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాలకు 25తో ముగుస్తున్న గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్‌ఎస్) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశం పొందేందుకు తుది గడువు ఈనెల 25న ముగియనుందని సంస్థ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు రూ.200, 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఏపీఓఎస్‌ఎస్ అధ్యయన కేంద్రాలతో పాటు ఏపీఓఎస్‌ఎస్ సైట్ సందర్శించాలని తెలిపారు.

నిద్రమాత్రలు మింగి వైద్యాధికారి ఆత్మహత్యాయత్నం

ఈపూరు: ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కమలాకర్ బుధవారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పని ఒత్తిడి, ఆసుపత్రిలోని సిబ్బంది తన మాట వినడం లేదనే కారణంతోను తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఆయన అన్నట్లు తెలిసింది. ఆయన తాను ఎవరివల్ల ఇబ్బంది పడుతున్నాడో ఒక పేపరు మీద రాసి తన విశ్రాంతి గదిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సిబ్బంది పిలవడానికి వెళ్లి వైద్యుడు అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి డాక్టర్లు, ఇతర సిబ్బంది సాయంతో ఆసుపత్రికి చేర్చారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

విద్యుత్‌షాక్‌కు గురై కేబుల్ వర్కర్ మృతి

కారెంపూడి: విద్యుత్‌షాక్‌కు గురై కేబుల్ వర్కర్ మృతి చెందిన ఘటన మండలంలోని బట్టువారిపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. దాచేపల్లి గ్రామానికి చెందిన జాలె నాగేశ్వరరావు (40) బట్టువారిపల్లె గ్రామంలో కేబుల్ లైన్‌లాగే క్రమంలో కరెంటు స్తంభాలకు కడుతుండగా ప్రమాదం జరిగింది. నాగేశ్వరరావు నిచ్చెన వేసుకుని కేబుల్ వైరును కరెంటు స్తంభానికి కడుతున్నాడు. నిచ్చెనకు తడి ఉండడం వల్ల అది విద్యుత్తు తీగలకు తగలడంతో ప్రసారం జరిగింది. మొదట షాక్‌కు గురై ఆ తర్వాత పక్కనే సప్లయ్ ఉన్న ఎల్‌టీ లైన్‌పై పడి విద్యుత్‌షాక్‌కు గురై నాగేశ్వరరావు కిందపడిపోయాడని తెలుస్తోంది. వెంటనే పెదకొదమగుండ్లలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారెంపూడి ఎస్‌ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేబ్రోలులో అత్యధికంగా 64 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా చేబ్రోలు మండలంలో 64 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా తాడేపల్లి మండలంలో 0.6 మి.మీ. పడింది. సగటున 15.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. దుగ్గిరాల 38.8, వట్టిచెరుకూరు 36.8, కొల్లిపర 28.2, కాకుమాను 22.2, పొన్నూరు 22, ప్రత్తిపాడు 12.8, తెనాలి 12.6, తాడికొండ 11.8, పెదనందిపాడు 11.2, తుళ్ళూరు 8.8, పెదకాకాని 4.2, గుంటూరు పశ్చిమ 4, గుంటూరు తూర్పు 1.2, మేడికొండూరు 2.2, మంగళగిరి 1.8, ఫిరంగిపురం మండలంలో 1 మి.మీ. చొప్పున వర్షం పడింది. అక్టోబర్ 17వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 71 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 101.4 మి.మీ. నమోదైంది.

పంటల సంరక్షణ ఇలా..

జిల్లాలో పత్తి పంట చాలా చోట్ల కాయ పగిలే దశలో ఉందని, ఈ దశలో వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎకరాకు 10 కిలోలు చొప్పున మెగ్నీషియం సల్ఫేట్ వేసుకోవాలని డీఏఓ నున్న వెంకటేశ్వర్లు సూచించారు. బోరాన్ కూడా పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వరి పంటకు ఇబ్బంది లేదని, పొట్ట దశలో ఉంటే నీరు ఎక్కువ అవసరమని సూచించారు. ఒకవేళ అధికంగా ఉన్నచోట్ల నీరు బయటకు పంపాలని తెలిపారు. వరిలో 25 కిలోల యూరియాలో 10 నుంచి 10 కిలోలు పొటాష్ కలిపి చల్లుకోవాలని డీఏఓ నున్న వెంకటేశ్వర్లు సూచించారు.

20న చలపతి ఫార్మసీలో ఓపెన్ చెస్ టోర్నమెంటు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: చెస్ ద్వారా విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకోవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఆనంద్ చెస్ వింగ్స్ సహకారంతో ఈనెల 20న నిర్వహించనున్న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ 2024 పోటీల బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చెస్ టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు మొత్తం రూ. 80 వేల నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. పాల్గొనే క్రీడాకారులు రూ. 800 రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ ఎం. గోపీనాథ్‌ను 9703049378 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థినికి సీఎం అభినందనలు



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తేజస్విని, పక్కన మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆగస్టు–2024 సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో అఖిల భారతస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని కొత్తపేట తేజస్వినిని సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసినట్లు మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు సీఏ, సీఎంఏ కోర్సుల్లో అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులు సాధిస్తుండటంపై ఆయన సంస్థ యాజమాన్యంతో పాటు అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.7 లక్షల డీడీని అందజేసినట్లు తెలిపారు.

ముగిసిన అండర్–15 చెస్ పోటీలు



రాష్ట్రస్థాయి చెస్ విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): మూడు రోజుల నుంచి రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నెక్స్‌జెన్ స్కూల్లో జరుగుతున్న లీలావతి మెమోరియల్ ఏపీ అండర్–15 బాలబాలికల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకుడు వై.వి.కె. చక్రవర్తి మాట్లాడుతూ బాలురల్లో ఎస్.వై.ఎస్. గంగాధర్, కె.భవన్, ఎం.వి. రుత్విక్, కె.సీతాసాగర్, బాలికల్లో వి.త్రిపురాంతిక, ఏ.ఎన్.ఎస్.ఎస్. దివ్య, జి.హిమతేజస్విని, ఎన్.రిషితలు వరుస స్థానాలు గెలుపొందారని తెలిపారు.

వీరందర్నీ త్వరలో జరగనున్న జాతీయ పోటీలకు పంపిస్తామని చెప్పారు. విజేతలకు ఏపీ చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి శర్మ, నిర్వహణ కార్యదర్శి ఫణికుమార్, సంయుక్త కార్యదర్శి రాజీవ్, స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ బహుమతులు అందజేశారు.